హే: ఒకళ్ళకొకళ్ళం కనిపిస్తున్నాంగాని-మనందరికీ బతకడానికి ఒక మార్గంమాత్రం కనబడ్డంలేదు నాన్నగారూ!

తం: మార్గం నేను చూపిస్తాగా. కాస్త ఓపిక పట్టండి మరి. ఒక్క పక్షంరోజులు ఓపికపట్టండి. అన్ని చిక్కులూ విడిపోతాయి.

హే: అప్పటికి కొంప అమ్మకం పూర్తి అవుతుందా?

తం: మాటాడుకుందాం. కొంపలో తిండి తిప్పలూ ఏమైనా ఉన్నాయా?

త: మీ దయవల్ల యింకా ఉన్నాయి.

తం: ఏపాటు తప్పినా సాపాటు తప్పదు. పదండి. అనక మాటాడుకుందాం. ఇంటి యిల్లాలా దేవుడిగంట వాయించి మాకందరికీ యింత ప్రసాదం పడేయ్!

(దేవుడి గదిలో గంట మోగుతుంది)

(ఇంకా వుంది)

---

స్కెచ్

# "అనాటి నావోడు"

"మంజుశ్రీ"

కిటికీప్రక్కనే కుర్చీలో కూర్చొని బయట ప్రపంచాన్ని చూసింది శైలజ. దూరంగా రెండు తాటిచెట్లు కనిపిస్తున్నాయి. ఆ తాటి చెట్ల నడిమధ్య కొచ్చాడు చంద్రుడు. ఇంతలోకే ఒకమబ్బు ఆ చంద్రుణ్ణి సగంమటుకు కప్పేసింది. అది చూడటానికి చాలా బాగుంది. ఎదురింటి వారి మేడమీద గదిలో లైటు ఆరిపోయింది. శైలజ లేచి కిటికీలోంచి క్రిందకు చూసింది. పక్కనున్న జాజిపందిరి విరగబూసింది. చంద్రకాంతలు వెన్నెట్లో మెరిసిపోతున్నాయి-రంగులు రంగులు.

వెనుకటికి ఓరోజున యిలానే తాను జాజి పందిరికింద నిల్చొని చంద్రుణ్ణి చూస్తుంటే వారొచ్చి వెనుకనుంచి కళ్లు మూశారు. తనకు తెలుసు తాను పలుకలేదు. జాజిపూలన్నీ కోసి, ఆకులతోసహా తన తలనిండా రుద్దారాయన ఆరోజు.

ఏమిటీ...ఇవాళ ప్రతీక్షణానికీ వారు గుర్తొస్తున్నారు? ఏది తలచుకొంటున్నా, ఏది చూస్తున్నా వారు గుర్తుకొస్తారు. తాను సహించలేదు. కాని మనసు ఎంతగా నిగ్రహించుకుందామన్నా ఆయన గుర్తొస్తున్నారు. ప్రొద్దున లేచింది మొదలు ఆయన వెనుక నడుస్తున్నట్లే వుంది. ప్రొద్దున్నే తాను పక్కమీద వుండగనే అమ్మవచ్చి "శైలూ పాల మనిషి కేక లేస్తున్నాడు కాస్త పాలు పోయించుకురామ్మా" అన్నది. తానులేచి పాలు పోయించుకొద్దామని బయటికి వెళ్ళింది. పాలమనిషి పక్కింటివాళ్ళతో పోట్లాడుతున్నది, డబ్బులిచ్చేసేయమని. నెలాఖరయి నాల్రోజులే గదే. ఎప్పుడైనా ఎగవేశామా...అట్లా మాట్లాడతావూ- అని సాగదీస్తున్నది పక్కింటావిడ. పౌర్ణమి దాటుతుంటే...యింకా ఎప్పుడు మీరిచ్చేది... అని పాలమనిషి అరుచుకుంటూ వెళ్ళిపోయింది. ఇంట్లోకివచ్చి పాలగిన్నె పెట్టి పెరట్లోకొచ్చింది. పక్కింటి తాతగార్ని ఇవాళ తిథేమిటని అడుగుతున్నదిఅమ్మ.ఆయనగారు పౌర్ణమి అనిచెప్పారు.

ఇవాళ ఆయన పుట్టినరోజు. అందుకనే తాను ఎక్కడా నిలుచోలేక,కూచోలేక యిదవుతున్నది. సరిగ్గా మూడు సంవత్సరాలక్రితం యీ ఇంట్లోనే ఆయన చివరి పుట్టినరోజు పండుగ జరిగింది. ఎంతమందో స్నేహితులు వచ్చారు. సరిగ్గా మూడు సంవత్సరాలక్రితం యిదే పౌర్ణమి. అదే పూర్ణిమి వారి చివరిపౌర్ణమి తరువాత మళ్ళీ శ్రావణ పౌర్ణమకు వారి ఏడాదిమాసికం...తాను మాత్రం యిలాగేమొండి బతుకు బతుకుతున్నది. ఇట్లా ఎన్ని సంవత్సరాలు గడపాలో! ఈయింట్లో ఇలా ప్రతిరోజూ వేదనతో కాలాన్ని వెళ్ళబుచ్చాలి. ఇప్పుడు అమ్మయినా తనకు అండ. ఇంక అమ్మ ఎన్నాళ్ళుంటుంది? అమ్మపోతే తనకు దిక్కులేదు, ఏంబ్రతుకు...ఏంబ్రతుకు...

ప్లీడరుగారమ్మాయి వనజ కాపురానికి పోయి రెండేళ్ళన్నా కాలేదు. మొన్న పురుడు పోసుకుంది. తనకు ఆ మాత్రం రాత గూడా లేదు. ఓ చిట్టితండ్రో, చిట్టితల్లో అయినా పుట్టివుంటే, శేషజీవితాన్ని వాళ్ళతోటు గడపగలిగేది. ఏం నోములు నోచుకుందోగాని తనరాత...వ్యథ... కథంతా...వ్యథ. రంగారావుగారి అమ్మాయి నీరజ ఎంత చక్కగా వుంటుంది. చంపకు చారెడేసి నీలినీలికళ్ళు. లావుగా నవ్వితే సొట్టలుపడే బుగ్గలూ...ఎంత చక్కగా వుంటుందో అలాంటి చిట్టితల్లి తనకూ ఒకతె వుంటే...పాపకు నీళ్ళు పోస్తూనో,జడదువ్వుతునో...గౌన్లు కుడుతూనో, పగలు పన్నెండుగంటలూ గడిపేసేది...కానీలే. యిలానే మొండిబ్రతుకు బ్రతుకుతుంది. పాదులు తీసేవాళ్ళేరు. నీళ్లుపోసేవాళ్లులేరు. ఆ పనులన్నీ ఓపిగ్గా వారు చేసేవారు. తానిప్పుడా చెట్లదగ్గరకు పోలేదు.

అమ్మ వంటయింట్లో పని పూర్తిచేసుకుని వచ్చినట్లుంది. "అదేమిటే శైలూ, చల్లగాలికి అక్కడకూచున్నావు.అసలే నీఒళ్లు మంచిదిగాదు. లోపలికొచ్చి పండుకోమ్మా" అంది. లోపలికెళ్ళి ఏమిటో గుర్తొచ్చినట్లుగా తిరిగివచ్చింది అమ్మ. "నీమేవు...శైలూ, ఆవీధిచివర శారదకు, పాపం స్ఫోటకం పోసిందట. ఇందాక మహాలక్ష్మమ్మ గారు చెప్పిపోయింది" అన్నది.

తాను గజగజ వణికిపోయింది. తన ముందర పది గజాల దూరంలో పిడుగుపడ్డా తనకంత భయం లేదు. స్ఫోటకం మాట వింటే తను ఒణికి పోతోంది. వారు స్ఫోటకం పోసే చనిపోయారు. ఆ పాడుపడ్డ పల్లెటూరుకు పోకపోయినా బాగుండేది. పొలం తాలూకు డబ్బు తీసుకరావటానికి ఆ వూరు పోయారు. వచ్చిన రోజే ఆయనకు జబ్బు పట్టుకుంది. పదిరోజుల్లో అంతా పూర్తయింది. పెద్దవాళ్ళందరూ కలసి తనను రెండు మూడు రోజులదాకా వారిదగ్గరకు పోనీయలేదు. తరువాత తాను ఎవరు చెప్పినా వినలేదు. వారు అన్నారు "శైలూ నువ్వు దూరంగా వుండు, ఈ వ్యాధి మంచిదిగాదు" అని. తన కక్కడనే ఫిట్ వచ్చేసింది. తనకు అప్పుడప్పుడు ఫిట్సు రావటం అలవాటే. తనకు ఫిట్ వచ్చే ముందు చెప్పలేని దుఃఖం పొంగిపొర్లు కొస్తుంది. మొట్టమొదట రోజుల్లో వారికి తెలీక తన కళ్ళవెంబడి నీళ్ళు రాగానే చేతుల్లోకి తీసుకొనేవారు. తనకు యింకా దుఃఖం ఎక్కువయ్యేది.

"శైలూ నువ్వు నా ప్రాణానివి, నువు చచ్చిపోతే ఒక్క క్షణం కూడా బ్రతుకలేను" అనేవారు, తనకెప్పుడు ఫిట్ వచ్చినా.

మూడురోజుల్లో వారి ముఖం ఎంత వికృతంగా మారిపోయింది! అబ్బ! వారు చనిపోయినారని వినగానే తనకు స్పృహతప్పింది. ఆ రోజల్లా తనకు స్పృహలేదు. మరునాడు యింట్లో వారు లేరు. తాను ఆ రోజునుంచే ఏకాకైపోయింది. జీవితంలో తానిక ఎప్పుడూ యింతే. ఇలా బ్రతకాల్సిందే.

అమ్మవచ్చి మళ్ళీ చెప్పింది, "శైలూ అక్కడ కూచోకు పోయి పండుకో" అని. తాను లేవలేదు.

కిటికీలోంచి మళ్ళా ఆకాశంవైపు చూసింది శైలజ. చంద్రుడు మహావేగంగా పరుగెత్తుతున్నాడు. చంద్రుడివెంట ఓ చుక్కగూడా పరిగెత్తుతున్నది. చంద్రుణ్ణాచుక్క కలుసుకోలేదుగామోసు. ఎంతదూరంపోయినా, చంద్రుడికీ ఆ చుక్కకూ గలదూరం ఒకటే. ఇప్పుడు తనగతి కూడా అలానే ఉంది. తనకూ వారికీగలదూరం ఎంతదూరం పోయినా ఒకటే. వారిని తాను కలుసుకోలేదు. రోజూ చంద్రుడు రాగానే ఆ చుక్కగూడా వస్తుంది. చంద్రుడు పరిగెత్తటం మొదలెడతాడు. చుక్కపరిగెత్తటం మొదలెడుతుంది. తాను రోజూ లేవగానే వారినిచూస్తుంది, వారిదగ్గరకు పోలేదు.

* * *

శైలజకుర్చీలోంచి లేచింది. కళ్ళవెంబడిధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి. వక్షస్సు అంతా నీటితో తడిసింది. పమిటె జారిపోయింది. ఎదురింటి మేడగదిలో లైటు వెలిగింది. మేడగది కిటికీలోంచి ఎవరో తననే చూస్తున్నారు. జారిపోయిన పమిటె తీసుకోటానికి ప్రయత్నిస్తున్నది. కాని చేతకావటంలేదు. అక్కడనే ఆ కుర్చీలోనే,అచేతనంగా పడిపోయింది శైలజ. ★